క్లుప్తంగా

ఆర్‌యూలో అవగాహన సదస్సు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐడీ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్పెషల్ సెషన్స్ జడ్జి భూపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో న్యాయం ఎలా పొందాలో విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి, జిల్లా అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, ఆర్‌యూ రెక్టార్ సీవీ.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.హరిప్రసాద్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎన్.యుగంధర్ బాబు, కర్నూలు టౌన్ డీఎస్పీ విజయశేఖర్, దిశా డీఎస్పీ సుధాకర్ రెడ్డి, సీఐడీ ఇన్‌స్పెక్టర్ డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులకు గురువారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బారిన పడిన వారికి తగిన మందులు, పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, తద్వారా వారి ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ మునీర్ అహ్మద్, శంకర్ పాల్గొన్నారు.

అరెస్టులు అన్యాయం

కర్నూలు(సెంట్రల్): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేయడం, విజయవాడకు వెళ్లే వారిని ఎక్కడికక్కడే అరెస్టు చేయడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు మల్లికార్జున గురువారం వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. సమస్యలు పరిష్కరించమంటే ముందస్తుగా అరెస్టు చేయడం దేనికి సంకేతమన్నారు. తక్షణమే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరారు.

సిటీ బస్సులు నడపాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో సిటీ సబర్బన్ బస్సులను నడిపి పేద, మధ్య తరగతి ప్రజలకు అధిక ఆటో చార్జీల నుంచి విముక్తి కల్పించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

19 తర్వాత సమ్మెబాట

కర్నూలు(సెంట్రల్): ఏపీ క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను 19వ తేదీలోపు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, రామాంజనేయులు తెలిపారు. గురువారం పున్నమి హోటల్ సమీపంలో సీఐటీయూ ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు నిరసనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఊరుకోం

కర్నూలు(సెంట్రల్): దళితుల ఆత్మ గౌరవాన్ని కించపరిస్తే ఊరుకునేది లేదని కేవీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ హెచ్చరించారు. గురువారం శ్రీరామనగర్‌లో నిర్వహించిన దళితుల రక్షణ యాత్రలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల సమస్యలపై స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.బాబురావు, భాస్కర్, ఆర్.నరసింహులు, జాన్సన్ పాల్గొన్నారు.

వార్డు అడ్మిన్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు అడ్మిన్ కార్యదర్శుల స్థానాల్లో వార్డు అడ్మిన్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు సచివాలయాల్లో పలువురు వార్డు అడ్మిన్లు మెటర్నిటీ లీవ్, మెడికల్ లీవ్, చైల్డ్ కేర్ లీవ్, ఉద్యోగం మానివేయడం తదితర కారణాలతో ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల పరిపాలన పరమైన ఇబ్బందులు వస్తుండటంతో అదనంగా వార్డు అడ్మిన్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఆర్వోను కలిసిన డీవీఎంసీ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన కె.మధుసూదన్‌రావును డీవీఎంసీ సభ్యులు శాంతకుమార్, సాయిప్రదీప్, రవిశాస్త్రి, నవీన్, రమేష్‌బాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీఆర్వో కార్యాలయంలో ఆయన్ను కలిసి పూలబొకే అందజేశారు.

నేడు ఎయిడ్స్‌పై మారథాన్ పరుగు

కర్నూలు(హాస్పిటల్): ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఈనెల 15న మారథాన్ పరుగును నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కోల్స్ కళాశాల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. కోల్స్ కళాశాల నుంచి రాజవిహార్ సెంటర్, సి.క్యాంపు సెంటర్, నంద్యాల చెక్‌పోస్టు వరకు పరుగు సాగుతుందన్నారు. 17 నుంచి 25 ఏళ్లలోపు యువతీ యువకులు పరుగులో పాల్గొనవచ్చన్నారు.

పూజకు వేళాయె

- వినాయక చవితి సంబరాలకు సిద్ధమవుతున్న నగర వాసులు
- మండపాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి
- హంగులు, ఆర్భాటాలతో ప్రమాదాల బారిన పడొద్దు
- ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

కర్నూలు కల్చరల్: లంబోధరుని ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. వినాయక చవితి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఊరూ వాడా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోనున్నారు. ఈ నెల 18న బొజ్జ గణపయ్య కొలువుదీరనున్నాడు. గంగమ్మ తనయుని రాకకు భక్తులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఉత్సవ కమిటీలు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కర్నూలు నగరంలో 2,600 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి వారు పేర్కొంటు న్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొననున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో భక్తితో పాటు భద్రతా ముఖ్యమే. ప్రమాదాలు జరగకుండా గణేష్ మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

మండపాల నిర్మాణంలో జాగ్రత్తలు

- మండపాలను విశాలమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలి.
- తడికెలతో కాకుండా ఆస్‌బెస్టాస్ రేకులతో నిర్మించుకోవాలి. వీటి వల్ల అగ్ని ప్రమాదాల తీవ్రత తగ్గుతుంది.
- కాలనీవాసులు, భక్తులు దర్శించుకుని వెళ్లేలా విశాలంగా ఉండాలి.



తుంగభద్ర నది తీరాన లక్ష్మీనరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో పూజలకు సిద్ధమవుతున్న 56 అడుగుల మట్టి వినాయకుడు

- మండపాల వద్ద అవసరమైన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్ నియంత్రికలు ఉన్న చోట, విద్యుత్ వైర్ల కింద మండపాలను ఏర్పాటు చేయకూడదు.
- మండపాలకు విద్యుత్ సౌకర్యం కోసం కచ్చితంగా ఆ శాఖ అధికారుల అనుమతి పొందాలి.
- విద్యుత్ అవసరాల కోసం ఐఎస్‌ఐ మార్కు కలిగిన తీగలను వినియోగించాలి.
- విద్యుత్ తీగలకు అతుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విగ్రహాల దర్శనానికి వచ్చే భక్తుల కోసం క్యూ పద్ధతి పాటించేలా ఏర్పాటు చేసుకోవాలి.
- వినాయక ప్రతిమల ఎదుట ఉంచే దీపాలపై నిరంతర నిఘా ఉండాలి.
- మండపాల సమీపంలో బాణా సంచా కాల్చకూడదు.
- పెట్రోల్,కిరోసిన్,గ్యాస్ సిలిండర్ల లాంటి పేలుడు పదార్థాలను మండల పాల వద్ద ఉంచరాదు.
- మండపాల వద్ద సరిపడా ఇసుక, నీరు, అగ్ని నిరోధక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి.
- అత్యవసర సేవల నిమిత్తం 100, 101, 108 నంబర్లు తెలిపే సూచికలు ఏర్పాటు చేసుకోవాలి.
- పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, వైద్య శాఖ అధికారుల నంబర్లు ఉంచుకోవాలి.

ప్రశాంతత ముఖ్యం

- రాత్రిళ్లు పెద్దపెద్ద శబ్దాలతో మైకులు పెట్టి ఆ ప్రాంతీయులను ఇబ్బంది పెట్టరాదు.
- మండపాల వద్ద పరిశుభ్రత పాటించాలి. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- ఉత్సవాల నిర్వహణ ప్రజలకు, భక్తులకు ఇబ్బందిగా మారకూడదు.



వినాయకుడి కొలువుకు సిద్ధం చేసిన మండపం

- ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మండపాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

ఉత్సవ సమితులకు సూచనలు

- గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి సూచనలు ప్రతి స్థానిక సమితి కచ్చితంగా పాటించాలి.
- గణనాథుడిని భగవంతుని ప్రతి రూపంగానే భావించి ఆ రూపం చెడకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి.
- సినిమాల్లోని పాత్రలు, రూపాలు వచ్చేలా విభిన్న రకాల ప్రతిమలు ఏర్పాటు చేయకూడదు.
- పోటీ పడి భారీ గణనాథులను కాకుండా చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం శ్రేయస్కరం.
- రోజు ఉదయం 8, రాత్రి 8 గంటలకు మహా మంగళ హారతి నిర్వహించాలి.
- రోజు సామూహిక పూజలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేయాలి.
- పిల్లలు, మహిళలకు వివిధ రకాలు పోటీలు నిర్వహించాలి.
- మండపాల వద్ద అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు తారసపడితే పోలీసులకు, ఉత్సవ సమితి వారికి సమాచారం ఇవ్వాలి.

విద్యుత్ సరఫరాకు అనుమతి తీసుకోవాలి



వినాయక విగ్రహాల మండపాలకు విద్యుత్ సౌకర్యం కోసం సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. విద్యుత్ తీగల కింద మండపాలను ఏర్పాటు చేసుకోకూడదు. విగ్రహాలు తరలించే సమయంలో విద్యుత్ వైర్లను కర్రలతో లేపడం, జరపడం చేయకూడదు. విద్యుత్ సరఫరాకు నాసిరకం సిల్క్ వైర్లు వాడకూడదు. నాణ్యమైన తీగలు, పరికరాలు వాడాలి. ఆన్ ఆఫ్ కంట్రోల్ పెట్టుకోవాలి. ఏవైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. అవసరం మేరకే విద్యుత్‌ను వాడుకోవాలి. వృథా చేయకూడదు.

– ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ

సూచనలు పాటించాలి



వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకునేందుకు గణేశ్ మహోత్సవం కేంద్ర సమితి సూచనలు తప్పనిసరిగా పాటించాలి. విగ్రహాల కోసం ఏర్పాటు చేసే మండపాల విషయంలో భద్రతా ప్రమాణాలు పాటించాలి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా మామిడాకులు, అరటి తోరణాలతో మండపాలను అలంకరించుకోవాలి. మండలపాల వద్ద మద్యం తాగడం, జూదమాడటం లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదు. నిర్వాహకులు, వలంటీర్లు మండపాల వద్ద ఆధ్యాత్మిక భావన పెంపొందేలా మసలుకోవాలి

– వేణుగోపాల్, నగర అధ్యక్షులు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు కల్చరల్: విద్యుత్ పురోగతి పనులు, మరమ్మతుల నిర్వహణలో భాగంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ కర్నూలు డివిజన్ డీఈఈ రాజమోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ ఫీడర్, 11 కేవీ ఫోర్త్‌క్లాస్ ఫీడర్‌ల పరిధిలోని గణేష్‌నగర్, సాయి విజయ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, పార్థసారథి టవర్స్, శ్రీవారి కుటీర్, జొహరాపురం రోడ్, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- పెద్దాసుపత్రిలో విద్యుత్ బిల్లులు చెల్లించని ఏజెన్సీలు
- తాజాగా మరోసారి నోటీసులు



ఆసుపత్రిలోని సీటీ స్కాన్ కేంద్రం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చెందిన విద్యుత్‌ను యథేచ్ఛగా వాడుకుంటూ బిల్లులు చెల్లించకుండా ఉన్న ఏజెన్సీల నిర్వాహకులను గత నెల జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 10 లోపు మొత్తం రూ.1.06 కోట్ల పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించాలని, లేకపోతే ఆయా సంస్థలను సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించినా నిర్వాహకులు ఖాతర్ చేయలేదు. అధికారులు మళ్లీ పిలిచి అడిగితే తాజాగా మరో రెండు నెలలు గడువు కావాలని కోరడం గమనార్హం. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి గురువారం ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సిబ్బందిని పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల మాట కూడా లెక్కచేయని పరిస్థితిలో ఉన్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల వద్ద నోటీసులు అతికించాలని సిబ్బందిని ఆదేశించారు. 11రోజుల్లోగా బిల్లులు కట్టకపోతే వారి సేవలన్నీ నిలిపివేస్తామని హెచ్చరించారు.

మియావాకీ పార్క్ ప్రారంభం

కర్నూలు (టౌన్): పట్టణ వాసులకు ఉద్యాన పార్కుల వల్ల ఆహ్లాదం, ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. గురువారం స్థానిక బృందావన్ నగర్‌లో ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మియావాకీ పార్క్‌ను కలెక్టర్ ప్రారంభించి మొక్క నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగర ప్రజలకు కాలుష్యం లేని వాతావరణం అవసరమన్నారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో పార్కులను తీర్చిదిద్దినట్లు చెప్పారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ రూ.10 లక్షలు వెచ్చించి మియావాకీ పార్క్‌ను సుందరీకరించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు షాకీర్ హుస్సేన్, ఉద్యానశాఖ ఏడీ విజయలక్ష్మి, డీఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కూరగాయల బండి యజమానితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన నగరంలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లోని 111వ సచివాలయంలో పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా.. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరికాన్ని రూపుమాపేందుకు కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆరోపించారు. అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కులాలు,మతాలు,ప్రాంతాలు,రాజకీయాలు చూడకుండా సంక్షేమ పథకాలను అమలు చేయడం సీఎం జగన్‌కే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు రైల్వే ప్రసాదు, రాజేష్, వాహిదా, నాగేశ్వరరావు,రేణుక, షఫీ, సంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు విధించొద్దు

నగరంలో విద్యుత్ కోతలు విధించొద్దని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. గురువారం ఆయన తన నివాసంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. నగరంలో ఎక్కడైనా అనుకోకుండా పవర్ కట్ అయితే క్షణాల్లో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం కావాల్సిన పోళ్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇళ్ల సమీపంలో ఉండే కరెంట్ తీగలను పైకి లాగి ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, కోఆప్షన్ సభ్యుడు నయింపాషా, నాయకులు రైల్వే ప్రసాదు పాల్గొన్నారు.

రెండు వాహనాల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): జిల్లా మైనింగ్ అధికారుల తనిఖీల్లో రెండు వాహనాలు పట్టుబడ్డాయి. గురువారం జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. కర్నూలు–డోన్ హైవేలో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా టిప్పర్‌లో రోడ్డు మెటల్ గ్రావెల్, లారీలో డోలమైట్ పౌడర్ తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారించి జరిమానా విధిస్తామని డీడీ తెలిపారు. తనిఖీలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, టెక్నికల్ అసిస్టెంట్ బాలు నాయక్ ఉన్నారు.

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 85 మంది గానూ 83 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. గురువారం స్థానిక పాతబస్తీలోని జమ్మిచెట్టు వద్ద క్రీడా మైదాన అభివృద్ధి పనులు, హిందూ, ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరపాలక పరిధిలో అభివృద్ధి పనులకు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు. నగర వాసులకు మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు, యువతకు క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి, షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ డీవీఆర్ సాయిగోపాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. దేశంలో విభిన్న భాషలు ఉన్నాయని, కానీ హిందీ నేర్చుకున్న వారు దేశమంతటా ఎక్కడైనా జీవనోపాధిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రచించిన భావనౌవాంకా సాగర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- స్కానియా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.అబ్దుల్ సలాం ఖాన్, ప్రిన్సిపాల్ షంషుద్దీన్, హిందీ విభాగాధిపతి షేక్ సలీం బాషా పాల్గొన్నారు.
- కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఉస్మానియా డిగ్రీ కాలేజీ హిందీ విభాగాధిపతి డాక్టర్ సలీంబాషా, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ఇందిరాశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు హరిసర్వోత్తముడు



గాడిచర్ల విగ్రహానికి పూలమాల వేస్తున్న సుభాస్‌చంద్రబోస్

కర్నూలు కల్చరల్: గాడిచర్ల హరి సర్వోత్తమ రావు ఆదర్శనీయులని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాస్ చంద్రబోస్ మాట్లాడుతూ గ్రంథాలయాల వ్యాప్తి, వయోజన విద్య కోసం కృషి చేసిన హరిసర్వోత్తమ రావు మన జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.బాషా, రాజకీయ నాయకులు దేవపూజ ధనుంజయాచారి పాల్గొన్నారు.

'జి.పుల్లారెడ్డి'లో క్యాంపస్ సెలెక్షన్లు



ఉద్యోగాలు పొందిన వారితో కళాశాల యాజమాన్యం

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్లలో 95 మంది ఉద్యోగాలు పొందారు. వారిని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాసరెడ్డి అభినందించారు.